భారీవర్షాల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాకు భారీ వర్షాల హెచ్చరికతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి జిల్లావ్యాప్తంగా విద్యుత్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. విద్యుదాఘాతంతో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. ఎటువంటి అంతరాయాలూ లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ పి.సాల్మన్‌రాజును ఆదేశించారు. అంతేకాకుండా జిల్లాలోని మండల స్థాయి అధికారుల ఫోన్ నెంబర్లు అందరికీ అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వారిని సంప్రదించేలా విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లను గ్రామాల్లోని ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అత్యవసర సమయంలో ఎవరైనా ఫోన్ చేస్తే స్పందించకపోయినా, సకాలంలో సమస్య పరిష్కరించకపోయినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు చేపడతామని కలెక్టర్ హెచ్చరించారు.

కాంట్రాక్టులో 'ఆరోగ్యం'..!

- కీలకమైన ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికనే ఉద్యోగ నియామకాలు
- వైద్యులు, నర్సులు అన్ని విభాగాల్లోనూ కాంట్రాక్ట్ ఉద్యోగులే
- రూ.12 వేల నుంచి రూ.25 వేలలోపే జీతాలు
- రెగ్యులర్ ఊసే మరిచిన పాలకులు
- కరోనాలోనూ ప్రాణాలకు తెగించి పని చేసిన ఆరోగ్య శాఖ సిబ్బంది
- జిల్లాలోని ఆరోగ్య విభాగాల్లో వేల సంఖ్యలో కాంట్రాక్ట్ ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజల ప్రాణాలకు సంబంధించిన అతి కీలకమైన ఆరోగ్యశాఖలో రెగ్యులర్ ఉద్యోగులు కనుమరుగవుతున్నారు. ఆరోగ్యశాఖలో ఉద్యోగ నియామకాలన్నీ పూర్తిగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికనే ప్రభుత్వం భర్తీ చేస్తోంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన పాలకులు ఆరోగ్యశాఖను పూర్తిగా కాంట్రాక్ట్‌మయంగా మార్చేస్తున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ ఉద్యోగ భరోసా, సమాన పనికి సమానవేతనం వంటివి ఏ ఒక్కటీ అమలు కాకపోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో నైరాశ్యం అలుముకుంటుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆరోగ్యశాఖలోని ఉద్యోగుల్లో 50 శాతం వరకూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నట్లు తెలుస్తోంది. రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతుంది. ఆరోగ్యశాఖలో మూడు విభాగాలుగా వైద్యసేవలు అందుతాయి. జిల్లా ఆరోగ్యశాఖ డిఎంహెచ్‌ఒ ఆధ్వర్యంలో పిహెచ్‌సిల పర్యవేక్షణ సాగుతోంది. జిల్లా, ఏరియా, కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రులన్నీ డిసిహెచ్‌ఎస్ పర్యవేక్షణలో పని చేస్తాయి. ఏలూరులోని బోధన ఆసుపత్రి మెడికల్ బోర్డ్ నియమించే సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పని చేస్తోంది. ఈ మూడు విభాగాల్లోనూ అత్యధికంగా కాంట్రాక్ట్ ఉద్యోగులే పని చేస్తున్నారు. రెండు జిల్లాల్లోనూ ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో వేల సంఖ్యలో కాంట్రాక్ట్ ఉద్యోగులే ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆసుపత్రుల్లో కీలక పాత్ర పోషించే పిహెచ్‌సి వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఫార్మాసిస్టులు, ఎఫ్‌ఎన్‌ఒలు, ఎంఎన్‌ఎఒలు, అటెండర్లు ఇలా అన్ని విభాగాల్లోనూ కాంట్రాక్ట్ ఉద్యోగులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో ఆరోగ్యశాఖలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి మరీ పని చేశారు. వీరికి ఇచ్చే వేతనాలు మాత్రం అంతంతమాత్రమే. వైద్యులకు తప్ప, మిగిలిన ఉద్యోగులు రూ.12 వేల నుంచి రూ.25 వేలలోపే జీతం అందుకుంటున్న వారే అత్యధికంగా ఉన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ జీతాల్లో పెరుగుదల లేకపోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగులంతా ఆర్థికంగా నలిగిపోతున్నారు. రెగ్యులర్ ప్రాతిపదికన పని చేసే స్టాఫ్ నర్సుకు రూ.70 వేలు జీతం ఉంటే, కాంట్రాక్ట్‌లో పని చేస్తే అదే ఉద్యోగికి రూ.25 వేలు మాత్రమే. పనిలో మాత్రం ఎటువంటి తేడా ఉండదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని న్యాయస్థానాలు చెబుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి.

ప్రతియేటా రెన్యువల్ చేయాల్సిందే..

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేసే ఉద్యోగుల పట్ల ఆరోగ్యశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. తమకు అనుకూలంగా ఉంటే ఒకలా.. లేకపోతే కక్ష సాధింపులకు పాల్పడటం వంటివి జరుగుతున్న పరిస్థితి ఉంది. గతంలో కొంతమంది ఉద్యోగులను ఉద్దేశపూర్వకంగా దూరంగా పంపించి ఇబ్బంది పెట్టడంపై బాధితులు ఉన్నతాధికారులను కలిసి పెద్దఎత్తున పోరాటం చేసిన పరిస్థితి ఉంది. కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రతియేటా రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. ఈ రెన్యువల్ చేయడం ఆలస్యమైతే రెండు, మూడు నెలలు జీతాలు నిలిచిపోతాయి. అంతేకాకుండా రెగ్యులర్ చేసే సమయంలో ఆరోగ్యశాఖలో పని చేసే కొంతమంది అధికారులు మామూళ్లు సైతం వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తే వైద్యసేవల్లో మరింత నాణ్యత పెరిగే పరిస్థితి ఉంటుంది. ప్రజలకు మరింత మేలు జరగనుంది.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఉద్యోగాల పేరుతో మోసగిస్తే కఠిన చర్యలు

పిజిఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి
కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హితవు పలికారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 267 వినతులు స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతులు వద్దకు కలెక్టర్ స్వయంగా వెళ్లి అర్జీలు స్వీకరించి, వారి సమస్య వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, దేవకీదేవి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామవరపుకోట మండలం రామన్నపాలెంకి చెందిన ఒకరు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3 లక్షలు తీసుకున్నారని, నేటి వరకు డబ్బులు తిరిగివ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనకు న్యాయం చేయాలని టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంకి చెందిన తోట రమేష్ అర్జీ ఇచ్చారు. దీనిపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పందిస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడే వారిపై అప్రమత్తంగా ఉండాలని, అటువంటివారి ప్రలోభాలకు గురై మోసపోవద్దని సూచించారు. ఇటువంటి మోసాలకు పాల్పడే వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అందించే అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మణిరాజు అర్జీనిస్తూ వంగాయగూడెం అంబేద్కర్ సెంటర్ నుంచి కొత్తూరుకు వెళ్లేరోడ్డు పాడైపోయిందని, సదరు రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

తొలగించిన 2500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి
కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రానికి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, తొలగించిన 2500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మిక సంఘాల నేతలు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి నాయకులు, కార్మికులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు కర్మగారాన్ని ప్రయివేటీకరించకుండా చూస్తామని, ప్రభుత్వరంగంలోనే కొనసాగేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణకు ప్రయత్నిస్తుంటే ఏమీ పట్టనట్టు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడాన్ని తీవ్రంగా విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నుండి 2500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను వారం రోజుల క్రితం తొలగిస్తే టిడిపి, జనసేన నేతలు స్పందించకపోవడం దారుణమన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో, సుదీర్ఘ పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కారు చౌకగా విక్రయించడానికి చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే ఆపాలని వారు డిమాండ్ చేశారు. తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించాలని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, నేత ఎ.అప్పలరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఐఎఫ్‌టియు నగర కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల జిల్లా నేతలు

కొనసాగిన ఆదివాసీల రిలే దీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎపి ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎపి ఆదివాసీ జెఎసి) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు మద్దతుగా రాయిగూడెం గ్రామస్తులు దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద కాపు రవ్వ నాగు మాట్లాడుతూ 2025 డిఎస్‌సిలో స్థానిక ఆదివాసీ అభ్యర్థులను కాదని స్థానికేతర అభ్యర్థులను చట్టానికి విరుద్ధంగా నియమిస్తే గ్రామగ్రామాన చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆదివాసీల గోడును ప్రభుత్వాలు పెడచెవిన పెడితే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోయరాజమండ్రి సర్పంచి రవ్వ చంద్రకళ, ఉపసర్పంచి నక్క రవితేజ, కుంజా గంగరాజు, పోడియం కొవ్వాడయ్య, తెల్లం సూరమ్మ, తెల్లం ప్రియాంక, పైద ముత్యాలరావు, కుంజా వెంకటేశ్వరరావు, పోడియం వెంకన్నబాబు, పోడియం రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో నినదిస్తున్న నేతలు

సీతంపేటలో దళితుల ఇళ్ల తొలగింపునకు యత్నం

అడ్డుకున్న నివాసితులు
వెనుదిరిగిన రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సీతంపేట దళితవాడలో కొందరి ఇళ్ల తొలగింపునకు రెవెన్యూ అధికారులు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. దళితవాడలోని సుమారు 20 ఇళ్లు తొలగించడానికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది జెసిబిలతో సోమవారం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అయితే తమకు ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా ఇళ్ల తొలగించడానికి రావడం సరికాదని దళితులు ఆందోళన చేపట్టి జెసిబిలను అడ్డుకున్నారు. సర్వే నెంబర్ 205లో దశాబ్దాల కాలం నుంచి నివాసం ఉంటున్నామని, అది ప్రభుత్వ పుంత పోరంబోకు భూమి అని అధికారులు తమ ఇళ్లు తొలగించడానికి సిద్ధం కావడం దారుణమన్నారు. ఇలాగైతే గ్రామంలోని పుంత పోరంబోకు భూమిలో ఆక్రమణలన్నింటినీ ఖాళీ చేయించాలని, కేవలం దళితుల ఇళ్ల తొలగింపు యత్నాల వెనుక ఆంతర్యం ఏమిటని నిలదీశారు. దీంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.

రెవెన్యూ సిబ్బంది వద్ద గుమిగూడిన జనం

పొగాకు బేరన్ల కోసం ఇళ్ల తొలగింపు!

సీతంపేటలో దళితుల ఇళ్ల తొలగింపు యత్నం వెనుక ఒకరి లబ్ధి కోసమే అనే ప్రచారం సాగుతోంది. అదే గ్రామానికి చెందిన ఒక రైతు దళితుల ఇళ్లకు ఆనుకుని ఉన్న పొగాకు బేరన్లను ఇటీవల కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. సదరు వ్యక్తి పంట పొలాలకు ఎదురుగా ఉన్న దళితుల ఇళ్లు అడ్డంగా భావించి, రెవెన్యూ అధికారులను రంగంలోకి దింపి ఇళ్ల తొలగింపునకు యత్నిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వచ్చే మూడు నెలల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, అత్యవసర మందులు ఎటువంటి కొరత లేకుండా చూడాలని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలో సోమవారం చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో హాజరైన వైద్యులకు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతిలకు వైద్య సేవలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగాలతో ఏరియా హాస్పిటల్‌కి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. రోగులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని తెలిపారు. ఏరియా హాస్పిటల్‌లో రోగుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా.. పట్టించుకోవడంలేదనే మాటలు వినిపించకూడదని, అందరూ బాధ్యతగా పనిచేయాలని అన్నారు. మన హాస్పిటల్‌లో పనిచేసే ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా, కలిసికట్టుగా పనిచేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఎ.నారాయణరావు, ఆర్ఎంఒ డాక్టర్ దీప్తి, గైనకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, నర్సింగ్ సూపరిటెండెంట్ కృష్ణవేణి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎకు డేటా అందజేస్తున్న వైద్యులు

కడప మహానాడుకు ఆవకాయ సిద్ధం

పర్యవేక్షిస్తున్న ఎంఎల్‌ఎ చింతమనేని

ప్రజాశక్తి- దెందులూరు

కడపలో జరుగనున్న మహానాడుకు వచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలకు వడ్డించేందుకు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆవకాయ పచ్చడి సిద్ధమౌవుతోంది. కొత్త ఆవకాయను సిద్ధం చేయటానికి మామిడి ముక్కలు కొట్టే వారిని, పచ్చడి పెట్టే వారిని సైతం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి దెందులూరు నుంచి కడపకు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తీసుకువెళ్లారు. కడప మహానాడు శిబిరం వద్ద కొత్త ఆవకాయ వంటకం సిద్ధం చేస్తున్నారు. వంటకాలను ఎంఎల్‌ఎ చింతమనేని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కొత్త ఆవకాయ వంటకంలో చింతమనేనితో పాటు తాము సైతం అంటూ తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి చేయి కలిపారు. టిడిపి మహానాడు కార్యక్రమంలో పాల్గొనే కార్యకర్తలకు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వంటకాల తయారీ, నాణ్యత, వడ్డింపు అంశాలను పర్యవేక్షించే భోజనాల నిర్వహణ కమిటీలో ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు అధిష్టానం సోమవారం బాధ్యతలు అప్పగించారు.



ఆవకాయ తయారీలో ఎంఎల్‌ఎ చింతమనేని, తదితరులు

వెంకటేశ్వర కళాశాల విద్యార్థిని మనోజ్ఞకు ఆలిండియా ర్యాంక్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని వెంకటేశ్వర జూనియర్ కాలేజ్ విద్యార్థికి ఐఐటీ జెఇఇ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ర్యాంక్ వచ్చిందని కళాశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. తమ కళాశాల విద్యార్థి కె.మనోజ్ఞ మండలంలోని వేగవరం గ్రామం బి ప్లానింగ్‌లో 116వ ర్యాంకు రావడం జరిగిందని, అలాగే బి ఆర్చ్‌లో 173వ ర్యాంకు వచ్చిందన్నారు. ఐఐటి రెండు గ్రూపుల్లో కూడా ఆ విద్యార్థికి ఆల్ ఇండియా ర్యాంకు రావడం పట్ల కాలేజీ యాజమాన్యం ఎంతో సంతోషం వ్యక్తం చేసింది. వారి తల్లిదండ్రులు కూడా ఎంతో ఆనందించారు. వెంకటేశ్వర కాలేజీ యాజమాన్యం వారు మాట్లాడుతూ తమ కాలేజీలో ఇలాంటి విద్యార్థులను ఎంతోమందిని తాము తయారు చేశామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా.. దేశవ్యాప్త సైకిల్ యాత్ర

11,11,111 మొక్కలు నాటడమే లక్ష్యం : ముత్తు సెల్వం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జాతీయస్థాయిలో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా తమిళనాడుకు చెందిన ముత్తు సెల్వం అనే యువకుడు దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నాడు. ఈ యాత్రలో భాగంగా సోమవారం నూజివీడు చేరుకున్నాడు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులు ముత్తు సెల్వంను పలకరించగా తన లక్ష్యాన్ని వివరించాడు. కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా కట్టి కుదిపేస్తున్న సమయంలో భారతదేశంలో ఆక్సిజన్ అందక ఎంతోమంది మృత్యువాత పడినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి పరిస్థితి భవిష్యత్తులో ఎప్పుడూ ఎవరికీ రాకూడదనే ఆశయంతో పర్యావరణ పరిరక్షణ లక్ష్యం దిశగా సైకిల్ యాత్రకు ఉపక్రమించినట్లు వివరించాడు. తాను యాత్ర కొనసాగించే సైకిల్‌కు ఏ మాత్రం గేర్లు లేవని, 122 కిలోల బరువైన సైకిల్‌ను తాను యాత్రకు వినియోగిస్తున్నట్లు చెప్పాడు. నెత్తిపై సేఫ్టీ గార్డ్‌గా హెల్మెట్, ఆ హెల్మెట్‌కు కెమెరా అమర్చినట్లు వివరించాడు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో 11,11,111 మొక్కలను నాటడం లక్ష్యంగా 40 వేల కిలోమీటర్లు యాత్ర కొనసాగించనున్నట్లు తెలిపాడు. ఇందుకోసం 21 డిసెంబర్ 2021వ తేదీన తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో ప్రారంభమైన తన సైకిల్ యాత్ర దేశం మొత్తం పర్యటించి 21 డిసెంబర్ 2027కు ముగుస్తుందన్నారు. ఇప్పటికీ 37,860 కిలోమీటర్లు యాత్ర కొనసాగగా 7 లక్షల 96,240 మొక్కలను నాటినట్లు చెప్పారు. అన్ని ప్రాంతాలలో ప్రభుత్వ అధికారులైన ఎస్ఐ, తహశీల్దార్, గ్రామ రెవెన్యూ అధికారులచే సర్టిఫికెట్ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి లక్ష్యంతో ఇంతటి భారీ యాత్ర సైకిల్‌పై చేపట్టిన గత చరిత్ర లేదని, ఇది ఓ గొప్ప రికార్డు సృష్టించిందని వివరించారు. అందుకే ప్రతి అంశం రికార్డు చేసే విధంగా కెమెరా అమర్చి, అన్ని ప్రాంతాలలో పత్రికలలో ప్రచురితమైన వార్తల కథనాలను సైతం రికార్డ్ చేస్తున్నట్లు తెలిపారు. అధికారుల సర్టిఫికెట్స్‌తో ఏఏ ప్రాంతాలలో, ఏఏ తేదీలలో, ఏఏ సమయాలలో యాత్రగా పర్యటించటం జరిగిందో ధ్రువీకరణ రూపంలో రుజువుగా ఉంటుందన్నారు. ఇది ఓ గొప్ప ఆశయానికి చరిత్రగా మారనుందని వివరించారు. సొంత ఖర్చులతో యాత్ర కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సైకిల్ వెనుక ఏర్పాటు చేసిన బాక్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్, కుకింగ్ కిట్ ఉంటాయని వివరించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సైకిల్ యాత్ర కొనసాగించి, సమీపంలోని పెట్రోల్ బంకులలో బస చేస్తున్నట్లు వివరించారు. ఇందుకోసం అన్ని ప్రాంతాలలో పాత్రికేయులు, అధికారుల సహాయ సహకారాలు ఎప్పటికీ మరువలేనని తెలిపారు.

సైకిల్‌యాత్ర నిర్వాహకుడు ముత్తు సెల్వం

సైకిల్ యాత్ర నిర్వాహకుడికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎస్ఐ

నిర్ణీత సమయంలో సమస్యల పరిష్కారం

జటిలమైన సమస్యల వివరాలు అర్జీదారులకు వివరిస్తాం..
సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించటం జరుగుతుందని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించటం జరుగుతుందన్నారు. జటిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే.. వాటి వివరాలను అర్జీదారులకు వివరిస్తామన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 15 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు వారి సహకారంతో గీతాంజలి జూనియర్, డిగ్రీ కళాశాల భీమడోలులో మంగళవారం జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్ర సోమవారం తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 748 మంది నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. జాబ్‌మేళాకు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, (బిబిఎం) ఫార్మసీ, ఎంబిఎ, పిజి, బిటెక్ వంటి విద్యార్హతలు ఉండి 18-40 సంవత్సరాల వయసు గల వారు అర్హులని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 8184887146, 7710177767, 9666322032ను (9988853335 - టోల్ ఫ్రీ)ను సంప్రదించాలన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్ నకలతో హాజరు కావాలని తెలిపారు.

టిడిపి పట్టణ అధ్యక్షులుగా కిషోర్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి పట్టణ అధ్యక్షులుగా కొండ్రెడ్డి కిషోర్‌ని నియమించారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి కిషోర్ మాట్లాడుతూ పట్టణ అధ్యక్షులుగా తనని నియమించిన ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, సీనియర్ నాయకులు ముత్తారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. జంగారెడ్డిగూడెం టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పదవి అలంకరణ కాకుండా, మరింత బాధ్యతగా పార్టీ కోసం వ్యవహరిస్తానని అన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి తోడ్పడే విధంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.

రైతులు, కౌలు రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలి

కలెక్టర్‌కు రైతు సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి రైతులు, కౌలు రైతులకు విత్తనాలను 75 శాతం సబ్సిడీపై సకాలంలో సరఫరా చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఖరీఫ్ పంటకు విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన కోకో, వరితో పాటు ఇతర వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వరి, వేరుశనగ, మినుము, పెసర, పత్తి, మిర్చి, కందులు తదితర పంటల విత్తనాలు సకాలంలో 75 శాతం సబ్సిడీతో అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కోకో రైతులకు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలై అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే కోకో పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించి కోకో గింజలను రైతుల నుంచి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, చలసాని జగన్మోహన్‌రావు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన టిడిపి శ్రేణులు

కలిదిండి: కడపలో మూడురోజుల పాటు జరగనున్న టిడిపి మహానాడు కార్యక్రమానికి అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లంకా రత్నారావు, నాయకులు మోకా రాంబాబు, తిరుమలశెట్టి ఈశ్వర పరశు రాముడు, వాతాడి రాంబాబు, మోకా నాగమల్లేశ్వరరావు, అంద్రాజు దుర్గ ప్రసాద్, రాము పాల్గొన్నారు.

రామరాజు వందో పుట్టినరోజు వేడుక

కలిదిండి: మండలంలోని తాడినాడలో అల్లూరి వెంకట రామరాజు(రాజబాబు) 100వ పుట్టిన రోజు వేడుకలను కొడుకులు, కుమార్తెలతో పాటు మూడు తరాల వారసులతో కలిసి ఘనంగా నిర్వహించారు. రాజబాబు, సత్యవతి దంపతుల ఆశీర్వాదాలను కుటుంబసభ్యులు పొందారు. ఇప్పటికీ ఆయన తనపనులు తానే చేసుకుంటారని కుటుంబసభ్యులు తెలిపారు.

చెక్కు పవర్ రద్దు సమంజసం కాదు

వైసిపి యువజన నాయకుడు, శ్రీరామవరం సర్పంచి కామిరెడ్డి నాని

ఏలూరు సిటీ : తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ తన చెక్కు పవర్ రద్దు చేయడం సమంజసం కాదని డిపిఒపై వైసిపి యువజన నాయకుడు, శ్రీరామవరం సర్పంచి కామిరెడ్డి నాని మండిపడ్డారు. ఏలూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో కామిరెడ్డి నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి వైసిపి సానుభూతిపరులపై, సర్పంచులపై అనేక విధాలుగా కక్షపూరిత చర్యలకి పాల్పడుతుందని ధ్వజమెత్తారు. టిడిపి నాయకుల మన్ననలను పొందే విధంగా డిపిఒ వ్యవహరిస్తున్నారని, తనపై కక్షపూరితంగా ఎటువంటి ఆధారాలు లేకపోయినప్పటికీ చెక్ పవర్‌ను రద్దు చేశారని తెలిపారు. వీధిలైట్లు కొన్న వాటిలో బిల్లులు ఉన్నా కానీ స్టాక్ రిజిస్టర్ లో ఎంటర్ చేయలేదని, పంచాయతీలో పనిచేస్తున్న స్వీపర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు జీతాలు ఇచ్చినవి రిజిస్టర్‌లో ఎంటర్ చేయలేదనే కారణంతో చెక్ పోవడం, రద్దు చేయడం సమంజసం కాదని అన్నారు. అసలు సర్పంచికు స్టాక్ రిజిస్టర్‌కు సంబంధం ఉండదని, ఫైనాన్సు వ్యవహారాలన్నీ సెక్రటరీ చూసుకుంటారని తెలిపారు. పంచాయతీలో మూడు నెలలకు ఒకసారి మీటింగ్ నిర్వహించాలని, మీటింగ్ నిర్వహిస్తున్న సమయంలో కొంతమంది టిడిపి రౌడీలు తమపై దాడులకు తెగబడుతున్నారని వాపోయారు. ఈ విషయమై డిపిఒకి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పైగా మీటింగ్‌ను ఏర్పాటు చేయడం మాత్రమే తన పని అని, ఎవరికీ భద్రత కల్పించే అవసరం తనకు లేదని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ 1994లో పంచాయతీరాజ్ చట్టం తీసుకువచ్చి గ్రామపంచాయతీల స్వయం ప్రతిపత్తి కలిగినవని చెప్పినప్పటికీ, రాజ్యాంగాన్ని మర్చిపోయి అధికారులు కూటమి ప్రభుత్వానికి కొమ్ము కాయడం బాధాకరమని అన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తెర ఆనంద్, వేదకుమారి పాల్గొన్నారు.

కొడుకుని హతమార్చిన తండ్రి

నేరాలు - ఘోరాలు

జంగారెడ్డిగూడెం: కొడుకుని కన్నతండ్రే హతమార్చిన ఘటన మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. కాపుల పవన్ కుమార్(24) చెడు వ్యసనాలకు బానిసై తల్లిదండ్రులను ప్రతిరోజు ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఎన్నిసార్లు మందలించినా కొడుకు ప్రవర్తన మారకపోవడంతో విసిగెత్తిన తండ్రి కాపుల నాగేశ్వరరావు ఈ ఘటనకు పాల్పడ్డాడు. తండ్రి సీతంపేటలోని ఒక చికెన్ దుకాణంలో పనిచేస్తాడని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

చింతలపూడి: నాటుసారా అమ్మినా, తయారు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ఫోర్స్‌మెంట్ ఎఇఎస్ సిహెచ్.అజయ్ కుమార్ సింగ్ అన్నారు. ఆయన పర్యవేక్షణలో సోమవారం ఎన్ఫోర్స్మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవిఎన్ఎస్.ఫణి కుమార్, సిబ్బంది మండలంలోని నాగిరెడ్డి గూడెం గ్రామంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. భూక్యా శ్రీను, వడిత్య బాలరాజు నాయక్, వడిత్య రామదాసుకు సంబంధించిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 43 లీటర్ల నాటుసారా, తిమ్మిరెడ్డిపల్లి గ్రామం కొనకళ్ల చిన్నారావు వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొయ్యలగూడెంలో అగ్నిప్రమాదం

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని తాడేపల్లిగూడెం రోడ్డులో సోమవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శ్రీమన్నారాయణ నగర్ ఆరంజ్ లాబ్‌కి ఆనుకొని ఉన్న పాత సామాను విక్రయ కేంద్రం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. పాత సామాను క్రయవిక్రయాలు నిర్వహించే కుటుంబం అక్కడే స్థిరంగా నివాసం ఉంటున్నారు. వంట చేసే సమయంలో పోపు పెడుతుండగా మంటలు వ్యాపించాయని, దాంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం అంతా అగ్నికీలలు చుట్టుముట్టాయని బాధిత కుటుంబం తెలిపింది. పాత సామానం కావడంతో అగ్నికీలలు భారీగా చుట్టుముట్టి ఉవ్వెత్తిన ఎగిసి పడ్డాయి. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం నుంచి వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. అగ్ని ప్రమాదం నష్టం విలువ అంచనా వేయాల్సి ఉందని అధికారులు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు మాయం

ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డిఎస్ఎస్.ప్రసాద్

చిట్ - చాట్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆయుర్వేద వైద్య విధానంలో ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తున్నామని, ప్రజల ఆదరణ చాలా బాగుందని ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డిఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. ఇంతవరకూ ఇక్కడ వైద్యాధికారిగా పనిచేసి ఉద్యోగోన్నతిపై విజయవాడ ప్రొఫెసర్‌గా బదిలీ అయిన డాక్టర్ కస్తూరి శిరీష స్థానంలో భీమవరం నుంచి డాక్టర్ ప్రసాద్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు.

ఓపి చూస్తున్న వైద్యాధికారి ప్రసాద్



ప్రశ్న : ఆయుర్వేద వైద్యానికి ప్రస్తుతం ఆదరణ ఎలా ఉంది?

డాక్టర్ : గతంతో పోల్చుకుంటే గత కొంతకాలం నుంచి ఈ వైద్యానికి ప్రజాదరణ లభిస్తోంది. ఉంగుటూరులో రోజుకు 35 నుంచి 50 వరకు ఓపి ఉంటోంది.

ప్రశ్న : ముఖ్యంగా ఎలాంటి వ్యాధులకు చికిత్స ఇస్తుంటారు?

డాక్టర్ : చర్మ సంబంధ వ్యాధులు, మోకాళ్లు, కీళ్ళు, వాతం నొప్పులు, గ్యాస్ట్రబుల్, వెరికోస్, పాండు రోగం తదితర వ్యాధులను నూరు శాతం నిర్మూలించే విధంగా ఔషధాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : పంచకర్మ వైద్య విధానం అమలు చేస్తున్నారా?

డాక్టర్ : ఆసుపత్రి ఆవరణలో రెండు ప్రత్యేక గదులు ఉన్నాయి. మోకాళ్ళ, జాయింట్ పెయిన్స్, వేరికోస్‌వైన్స్ వంటి వ్యాధులకు ప్రత్యేక చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు అందుబాటులో ఉన్నాయి. ఫిజియోథెరపీ విధానం కూడా ఉంది.

ప్రశ్న : ఔషధాల సరఫరా ఎలా ఉంది?

డాక్టర్ : రిక్రూట్‌మెంట్ పంపిస్తే కావల్సిన ఔషధాలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. మందుల కొరత ఏమీ లేదు. ప్రభుత్వ గ్రాంట్లకు తోడు గ్రామస్తులు, దాతల సహకారంతో ఆసుపత్రి ప్రాంగణం ఆధునీకరణ పూర్తయింది. ఎంతో ఆహ్లాదకరంగా ఆసుపత్రి ఉంచుతున్నాం. మండలంలో అన్ని గ్రామాల వారికి నిత్యం అందుబాటులో ఉంటూ ఆయుర్వేద వైద్యాన్ని అందించేందుకు సాయశక్తులా కృషిచేస్తాను. అందుకు గ్రామస్థులు, దాతలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలు తీసుకుంటూ అందరికీ ఆరోగ్యం అందిస్తాం.

బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ తప్పనిసరి

డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ ఎస్.శ్రీకర్ బాబు

ఏలూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా త్వరలో అమలు చేసే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయటానికి వారి ఖాతాలను ఎన్‌పిసిఐ విధానం కింద ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని ఏలూరు డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ అధికారి ఎస్.శ్రీకర్ బాబు సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరటానికి వారి బ్యాంక్ ఖాతాలు ఆధార్‌తో లింకై వుండాలన్నారు. దీని నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంబంధిత ప్రాజెక్ట్ డైరెక్టర్, జిఎస్ డబ్ల్యూఎస్ (సచివాలయ సిబ్బంది) వారికి తగు సూచనలు ఇవ్వటం జరిగిందన్నారు. వారి సూచనలకు అనుగుణంగా ప్రజలందరూ తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవలసిందిగా తపాలా శాఖ నుంచి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతానికి జిల్లాలో సుమారు 7 వేల మందికి ఇంకనూ బ్యాంక్ ఖాతాలకి ఆధార సీడింగ్ లేకుండా వున్నాయన్నారు. బ్యాంక్ ఖాతాలు లేని వారు కేవలం రూ.200లతో తపాలా శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతా ఓపెన్ చేసుకొని, ఆ ఖాతాకు ఆధార్‌ను అనుసంధానం చేసుకొనే ప్రక్రియ ప్రతీ పోస్ట్ ఆఫీసులో కలదన్నారు. దీనికి ఈనెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించడానికి పోస్టల్ శాఖ తగిన ఏర్పాట్లు చేయటం జరుగుతుంది. ప్రజలు తమ సమీపంలోని పోస్ట్ ఆఫీసును సంప్రదించి, పోస్టల్ సిబ్బందికి ఎటువంటి ధృవీకరణ పత్రాలు సమర్పించనవసరం లేకుండా ఖాతాలను ఓపెన్ చేసి ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. వీటితోపాటు నేఫ్ట్, ఫోనేపే, గూగుల్ పే తదితర యాప్‌లకు లింక్ చేసుకునే సదుపాయం వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు కె.రాజేష్ సీనియర్ బ్రాంచి మేనేజర్, ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంకు ఏలూరు(ఫోన్ నెం: 7893436211)ను సంప్రదించవచ్చన్నారు. మీ ఊరు/ప్రాంతంలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేసి అవసరమున్న అందరికీ ఆధార్ అనుసంధారిత ఖాతాలను చేసుకొనే ఏర్పాటును చేస్తారన్నారు. ప్రజలందరూ ఈ సదావకాశాన్ని ఉపయోగించుకొని సంక్షేమ పథకాల లబ్ధి ఎటువంటి ఆటంకం లేకుండా పొందే విధంగా చేసుకోవాలని ఆయన కోరారు.

మరణం కుటుంబంలో బాధను మిగులుస్తుంది

రాజ్యసభ సభ్యులు, టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

మండవల్లి : మరణం సంభవించిన కుటుంబంలో విషాదఛాయలు అలముకుంటాయని ఆ బాధ ఎవరూ తీర్చలేనిదని రాజ్యసభ సభ్యులు, టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అన్నారు. భైరవపట్నం గ్రామ ప్రముఖులు రైతు గాదిరాజు భాస్కర వర్మ సతీమణి భారతి ఇటీవల మరణించారు. భైరవపట్నంలోని ఆయన నివాసంలో సోమవారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమంలో ఆయనతోపాటు కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, మాజీ మంత్రి చేకూరి రంగనాథరాజు, మాజీ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, టిటిడి బోర్డు మాజీ సభ్యులు గాదిరాజు సుబ్బరాజు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణం కుటుంబంలో తీరని లోటును కలుగజేస్తుందని అన్నారు. మరణం అనివార్యమైనప్పటికీ మరణం వల్ల కలిగే బాధ అంతా ఇంతా కాదన్నారు. మనోధైర్యం పెంపొందించుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

సబ్సిడీపై పశువుల దాణా

పశు వైద్యాధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న పాడి రైతులకు పశువుల దాణాపై సబ్సిడీ అందిస్తోందని ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో పశువుల దాణా సబ్సిడీ రేట్లకు రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వారు పశువుల దాణాను సగం ధరకే పొందవచ్చు అన్నారు. ఈ సబ్సిడీ పంపిణీకి రైతు సేవా కేంద్రాలు, పశు వైద్యశాలలు ఉపయోగించబడతాయని తెలిపారు. కిలో 22.11 ప్రభుత్వం కొని రైతు సేవ కేంద్రాలు, పశు వైద్యశాల ద్వారా 11.10కే ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. 20 శాతం ప్రోటీన్ కలిగిన ఈ దాణను ప్రభుత్వం మొదటిసారి అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ ఎంపిటిసి రాజారెడ్డి, కొమ్ము తిరుపతిరావు, చక్రపు మారేశ్వరావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : పాడి రైతులకు 50 శాతం రాయితీపై ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ ద్వారా పశువుల దాణా అందిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి కె.కోటేశ్వరరావు సోమవారం విలేఖరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పాడి రైతులకు 12 టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులకు 50 కేజీల దాణా 50 శాతం రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. 50 కేజీల దాణా సంచి రూ.1,110 ఉండగా రాయితీపై రూ.555కే ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో లేదా పుశువుల ఆసుపత్రిలో సంప్రదించాలని తెలిపారు. పాడి రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్దిష్ట సమయాల్లోనే భారీ వాహనాలకు అనుమతి

ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు

ఏలూరు స్పోర్ట్స్ : ఏ సమయంలో పడితే ఆ సమయంలో నగరంలోకి భారీ వాహనాల అనుమతి రద్దు చేయబడిందని, అలా చేసినట్లయితే వాహనాలను సీజ్ చేస్తామని ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు హెచ్చరించారు. ఏలూరు నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి సోమవారం ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇందులో పొందుపరిచిన అంశాల ప్రకారం సాధారణంగా భారీ వాహనాలు నగరంలోకి రాత్రి 10 దాటిన తర్వాత ప్రవేశించాలని సూచించారు. అనంతరం ఉదయం 8 గంటల లోపు మాత్రమే నగరంలోనికి ప్రవేశించాలని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎటువంటి భారీ వాహనాలను నగరంలోకి అనుమతించమని ఆయన అన్నారు. తదుపరి మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భారీ వాహనాలు అనుమతి ఉంటుందని, నాలుగు గంటల తర్వాత 10 గంటల లోపు వారికి అనుమతి లేదని తెలిపారు. తిరిగి రాత్రి పది గంటల నుంచి యధావిధిగా వాహనాలు అనుమతింపబడతాయని ఆయన అన్నారు. అలాగే భారీ వాహనాలు రద్దీ సమయాల్లో నగరంలోకి ప్రవేశించడం ద్వారా ట్రాఫిక్ జామ్ సమస్య పెరుగుతుందని ఆయన అన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకుందామని మంగళవారం నుంచి వీటిని అమలుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలియజేశారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఫిర్యాదులు

ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్

ఏలూరు స్పోర్ట్స్ : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వీడియో రికార్డింగ్ చేస్తూ బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నామని, వీటివల్ల చర్యలు త్వరితగతిన తీసుకునేందుకు డిజిటల్ విధానం సహకరిస్తుందని ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్ అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ సోమవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్ పాల్గొని ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులు కూడా ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ ద్వారా స్వీకరించారు. వీటి ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే డిజిటల్ విధానంలో ఫిర్యాదులు స్వీకరిస్తే పరిష్కారం కూడా త్వరితగతిన ఉంటుందని వీరి అంచనా వేశారు. ఇందులో భాగంగా ఒక ఫిర్యాదుదారుడు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ కెమెరా ముందు కూర్చుని తమ ఫిర్యాదులు తెలియజేస్తాడు, దానికి అనుగుణంగా ఆ కెమెరా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అతన్ని కొన్ని ప్రశ్నలు అడుగుతుంది వెంటనే అది సంబంధిత పోలీస్ స్టేషన్‌కు చేరవేయబడుతుంది. ఇలా చేయడం వల్ల పేపర్ వర్క్‌తో పాటు ఆలస్యం జరిగే పరిస్థితులు కూడా తగ్గుతాయి. ఈ సందర్భంగా ఎస్‌పి శేఖర్ మాట్లాడుతూ ఈ సోమవారం నుంచి పూర్తిస్థాయిలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించడం మొదలు పెట్టామని తెలిపారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 39 ఫిర్యాదులను స్వీకరించామన్నారు. ఈ ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు చేరవేశామని కూడా తెలిపారు. మొత్తం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎఐ బోట్ అనే ప్రక్రియ ద్వారా చేస్తున్నామని తెలిపారు. ఫిర్యాదుదారులకు, వారి సహాయకులకు శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ ద్వారా భోజన సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూ సేకరణకు భూముల పరిశీలన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ప్రాజెక్టు ముంపులో భాగంగా అల్లూరి. సీతారామరాజు జిల్లా కూనవరం గ్రామం ముంపుకి గురవ్వడంతో అక్కడి నిర్వాసితులకు ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ నిమిత్తం భూమికి భూమి, ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి గాను బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పలు గ్రామాల్లో ఉన్న భూములను పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం మండలంలోని తాటియాకులగూడెం, జీలుగుమిల్లి దర్భగూడెం, బర్రింకలపాడు, వంక వారిగూడెం, రామన్నపాలెం రెవెన్యూ పరిధిలో రైతులకు చెందిన భూములను అక్కడి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణ రెడ్డితో పాటు రెవెన్యూ అధికారుల బృందం అక్కడి గ్రామస్థులు, ఇక్కడి రెవెన్యూ, సర్వేయర్ల బృందం భూములను పరిశీలించారు. రెండు మండలాల పరిధిలో మొత్తం 200 ఎకరాల వరకు తీసుకోనున్నట్లు చెబుతున్నారు. ఈ భూములకు గాను ప్రస్తుత భూ సేకరణ చట్టం ప్రకారం ధర నిర్ణయించనున్నట్లు సమాచారం.

యోగాతో మానసిక ఆరోగ్యం : కలెక్టర్

నేడు వెయ్యి మందితో భారీ ర్యాలీ : జెసి

ఏలూరు : యోగాను క్రమం తప్పకుండా సాధన చేస్తే శారీరక, మానసిక, భావోద్వేగ శ్రేయస్సును సాధించడానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక టిటిడిసిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖల వారీ ఉద్యోగుల యోగాభ్యాస కార్యక్రమం కింద సోమవారం రెవెన్యూ ఉద్యోగుల యోగాభ్యాస కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాను క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల హృదయ సంబంధ ఫిట్‌నెస్ పెరగడం, రక్తపోటు సాధారణీకరణ వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ఉద్యోగులు యోగాను సాధనచేస్తూ ఒత్తిడిని నియంత్రించుకోవచ్చన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులకు యోగాపై అవగాహన కలిగించేందుకు జూన్ 20వ తేదీవరకు యోగాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, ఏలూరు, పెదపాడు తహశీల్దార్లు జివి.శేషగిరి, కృష్ణజ్యోతి, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం నుంచి మండలాల్లో యోగాభ్యాస కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. జిల్లాలోని 4 చారిత్రక ప్రదేశాల్లో యోగా శిబిరాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలన్నారు. ఈనెల 27వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు ఏలూరు ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు, తిరిగి కొత్త బస్టాండ్ వరకు వెయ్యి మందితో సామూహిక యోగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఆయూష్ ఆర్‌డిడి లక్ష్మీసుభద్ర, డిఇఒ కె.వెంకటలక్ష్మమ్మ, అధికారి ఎన్.జితేంద్ర పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



పేపర్ క్రాఫ్ట్‌తో చిన్నారులు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సోమవారం 24వ రోజు ఎంతో సందడిగా ఆహ్లాదకరంగా కొనసాగుతున్నాయి. ఈ శిక్షణ తరగతులకు చిన్నారులకు అనేక అంశాలలో, అనేక రీతిల్లో శిక్షణ ఇచ్చుటకు సీనియర్ రిసోర్స్ పర్సన్లు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ముందుగా చిన్నారులకు దురాశ దుఖానికి చేదు, ఇద్దరు మిత్రుల నీతి కథలను బోధించారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు పి.సంతోష్ కుమార్, ఎండి యాస్మిన్ చిన్నారులకు రంగు రంగు కాగితాలతో(పేపర్ క్రాఫ్ట్) గృహాలంకరణ వస్తువుల తయారీలో శిక్షణ అందించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ పి.అనురాధ చిన్నారులకు సైన్స్ ప్రాజెక్ట్ తయారీపై శిక్షణ అందించారు. పలు దేశాలు, దేశ రాజధానులపై క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సరదా గేమ్స్ ఆడించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూముల కౌలు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

దేవదాయ ధర్మదాయ శాఖ, పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, సిద్ధాంతం గ్రామములో గల శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంనకు చెందిన సిద్ధాంతం గ్రామంలో గల ఈ క్రింది తెలిపిన సర్వే నెంబరులో గల భూములు సాగు చేసుకొనే హక్కునకు 2025-2026 నుండి 2027-2028 సంవత్సరములకు ది. 05-06-2025 గురువారం ఉదయం గం॥ 9.00లకు సదరు దేవాలయం వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున టెండర్ కమ్ బహిరంగ వేలం పాట జరుపబడును. కావున ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

వ. నెం.	గ్రామం	సర్వే నెంబరు	విస్తీర్ణం య.సెంట్లు	ధరావత్తు సొమ్ము	బహిరంగ వేలం తేదీ సమయం, ప్రదేశం	సేద్యం చేసుకొనే కాలం
1	సిద్ధాంతం	394	1.98	5000/-	ది.05-06-2025 గురువారం ఉదయం గం॥ 09.00లకు గల శ్రీ స్వామి వారి ఆలయం వద్ద	2025-2026 నుండి 2027-2028 వరకు (3 సం॥రంలు)

ముఖ్య షరతులు:

మిగతా పాట షరతులు వివరములు పాట కాలమందు చదివి వినిపించబడును.

ఇతర వివరములు మరియు మిగిలిన నియమ నిబంధనలు ఆఫీసు పనిచేయు వేళలో ఈక్రింది అడ్రస్సు వారిని సంప్రదించి తెలుసుకోగలరు.

సింగిల్ ట్రస్టీ - శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానం

సిద్ధాంతం, 25-5-2025 సిద్ధాంతం, సెల్: 9849114191

అర్హులకు ఉపాధి పని కల్పించాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి. బాలరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం నియోజకవర్గంలోని ఏడు మండలాల ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు జరుగుతున్న ఉపాధి హామీ శ్రామికుల పని విధానం, హాజరు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పేద ప్రజలు ఉపాధి హామీ పనులకు వచ్చే విధంగా సిబ్బంది చొరవ తీసుకొని పని దినాలు పెంచాలని, అదే విధంగా ప్రతి శ్రామికుడికి సరైన వేతనం చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి వేతనాలను త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విధులలో ఉన్న సిబ్బంది అవినీతికి పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు ఎపిఒలతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు

ఇ.పి.నెం. 79/2018

ఒ.యస్.నెం. 111/2017

బిట్వీన్:

మెట్టపల్లి సాంబమూర్తి ...డిక్రీహోల్డర్

మరియు

మారుమూడి ధర్మతేజ ...జడ్జిమెంటుడెటార్

డిక్రీహోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల ఇ.పి వారంటు గ్రంధంలో జడ్జిమెంటు డెటార్ అయిన మారుమూడి ధర్మతేజ, S/o. లేటు కాంతారావు, కొవ్వూరుగూడెం, H/o. చింతలపూడి, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 29-06-2025 సం.రం తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** వాయిదా అయివున్నది. కావున సదరు జడ్జిమెంటు డెటార్ స్వయముగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి, తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు ఇ.పి వారంటు గ్రంధము తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
అడ్వకేట్సు, అశోక్‌నగర్, ఏలూరు

ఏలూరు
ది.26-05-2025

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 28/2008

Between:

లంక రాంబాబు -వాది

AND

కొరుప్రోలు నాగరాజు (died) వగైరా -ప్రతివాద్లు

వాది దాఖలు చేసిన పేపరు ప్రకటన

దావా సమన్లు:

D-10: మేడిశెట్టి రమణమ్మ, W/o. అప్పారావు, వయస్సు 44 సం॥లు, గృహిణి, దొండపూడి, గోపాలపురం మండలం, ప॥గో॥జిల్లా.

D-11: నవుడు నాగలక్ష్మి, W/o. నూకరాజు, వయస్సు 37 సం॥లు, గృహిణి, జంగారెడ్డిగూడెం, ప॥గో॥జిల్లా.

D-12: సబ్బారపు ఏసమ్మ, W/o. వాసు, వయస్సు 36 సం॥లు, గృహిణి, పట్టిసీమ, ప॥గో॥జిల్లా.

D-13: మేడిశెట్టి రజని, W/o. వెంకన్న, వయస్సు 32 సం॥లు, గృహిణి, దొండపూడి, గోపాలపురం మండలం, ప॥గో॥జిల్లా.

D-14: కైసర్ల వీరబాబు, W/o. సాంబమూర్తి, వయస్సు 45 సం॥లు, వ్యవసాయం, జంగారెడ్డిగూడెం, ప॥గో॥జిల్లా.

D-15: కైసర్ల చిన్న, S/o. సాంబమూర్తి, వయస్సు 39 సం॥లు, వ్యవసాయం, జంగారెడ్డిగూడెం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో మీకు దావా సమన్లు ఎన్నిసార్లు పంపినా మీరు తీసుకోనందున మీకు దావా సమన్లు నిమిత్తం మీరు పై కోర్టు వారి ఎదుట హాజరు అగు నిమిత్తం ది. 18-6-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీకు ప్లయింటు పరిహారములపై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల **ది. 18-6-2025వ తేదీని ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించడమగును.

వాది తరపు న్యాయవాదులు
సాదే నరసింహారావు
బొగ్గవరపు సత్యన్నారాయణమూర్తి
పెద్దాపురం

పెద్దాపురం
ది.25-5-2025 సెల్: 9885084194

పబ్లిక్ నోటీస్

నా క్లయింటును ప॥గో॥జిల్లా, పాలకోడేరు మండలం, గొల్లలకోడేరు గ్రామ కాపురస్తులు శ్రీ ముదుండి బంగార్రాజు గారి భార్య: ముదుండి పద్మావతి గారు మాకు ఇచ్చిన సంజాయిషి ప్రకారం యావన్మందికి తెలియచేయునది.

మా క్లయింటు ముదుండి పద్మావతి దేవి గారి తల్లి గారైన అల్లూరి వెంకట సుబ్బరాజు గారి భార్య అల్లూరి అనసూయదేవి గారి మరణానంతరము మా క్లయింటు తల్లి గారు వ్రాసిన వీలునామా ప్రకారము ది. 27-01-2025 నుండి మా క్లయింటుకు చెందిన ఆస్తులపై మా క్లయింటు ముదుండి పద్మావతి దేవి గారికి చెందిన ఆస్తులపై ఇతరులు ఎవ్వరికీ ఎట్టి అధికారం లేదనినూ సదరు ఆస్తులకు ఎవరైన తనకాలు, కౌలు, అగ్రిమెంట్‌లు, మరియు అమ్మకములు చేసిన అట్టివి చెల్లవని ఈ నోటీసు ద్వారా తెలియచేయుచున్నాము. ఈ నోటీసులో ఆస్తులను ఎవరైనా అగ్రిమెంట్స్, లీజు, తనకా, అమ్మకము, కొనుగోళ్ళు చేసిన ఎడల అట్టివారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోబడును. అని ఈ నోటీసు ద్వారా తెలియచేయుచున్నాము.

ఆస్తుల వివరములు:-

1. A.K.S జిల్లా, రాజోలు మండలం, శివకోడు గ్రామంలోని R.S. No: 726 యా.2.06 సెంట్లు A.K.S జిల్లా, రాజోలు మండలం, చింతలపల్లి గ్రామంలోని, R.S. No: 141/1 యా.2.38 సెంట్లు R.S. No: 142 యా.0.41 1/3 సెంట్లు, R.S. No: 71/18, 16 యా.0.32 సెంట్లు కొబ్బరితోట మరియు R.S. No: 141/G, యా.1.90 సెంట్లు మరియు
2. ప॥గో॥జిల్లా, గణపవరం మండలం, కేశవరం గ్రామంలోని D.No: 1-57/1, RCC భవనం మరియు దానికి చెందిన 1408 చ.గ స్థలమును, R.S. No: 185/7 యా.0.66 సెంట్లు R.S. No: 185/8 యా.0.47 సెంట్లు, R.S. No: 185/10, యా.0.06 సెంట్లు, R.S. No: 184/1 యా.1.10 సెంట్లు, R.S. No: 184/2 యా.0.96 సెంట్లు, R.S. No: 184/3 యా.0.20 సెంట్లు, R.S. No: 184/6 యా.0.77 సెంట్లు, R.S. No: 184/7 యా.0.40 సెంట్లు, మరియు
3. ప॥గో॥జిల్లా, గణపవరం మండలం, కేశవరం గ్రామంలోని SBI Branch A/c 11557324941, CIF No: 81276280320 అల్లూరి అనసూయ దేవి గారికి చెందిన నగదును మరియు MRF కంపెనీ వారి ప్రాథమికంగా కేటాయించిన షేర్లు 487 మరియు పోస్టల్ డిపాజిట్లు మా క్లయింటుకు మాత్రమే చెందుతాయని ఇతరులు ఎవ్వరికీ ఏవిధమైన హక్కులు లేవని ఈ నోటీస్ ద్వారా తెలియచేయుచున్నాము.

గూడూరి సాంబమూర్తి
సెల్: 99487 54306
గరికిముక్కు సుబ్బయ్య
సెల్: 99595 58600
అడ్వకేట్స్, భీమవరం